నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
18-06-2025
పేజీలు: 02



## ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. గురువారం ఢిల్లీలో ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్‌తో రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి కీలక భేటీలో పాల్గొంటారని సమాచారం. అలాగే ఏఐసీసీ పెద్దలను కలిసి పెండింగ్ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది. గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు ఢిల్లీలోనే ఉండనున్నట్టు తెలియవచ్చింది. అలాగే పార్టీ అధిష్టానాన్ని, పలువురు కేంద్ర మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి కలుస్తారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఏడాదిన్నరలో చాలా సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్ళివచ్చారు. వివిధ సందర్భాల్లో అధిష్టానం పెద్దల్ని కలిసి మంతనాలు జరిపారు. కాగా ఈ మధ్య తాజాగా ఢిల్లీ వెళ్ళి వచ్చాక రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని ఆయనను దగ్గరగా గమనిస్తున్నారు అంటున్నారు. ఇంకా చెప్పాలంటే.. కొత్త బలం వచ్చినట్టుందని, కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా పెరిగాయని చెప్పకుంటున్నారు. గడిచిన 18 నెలలుగా.. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో ఎవరేం చేసినా.. ఏం మాట్లాడినా చూసీ చూడనట్టే సీఎం ఉన్నారు. కేబినెట్ మంత్రుల మీద రకరకాల ఆరోపణలు వచ్చినా.. అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడంలేదు. కానీ, ఇప్పుడు ఆయన వైఖరి చూస్తుంటే.. అదంతా గతం. ఇక మీదట అలాంటివేవీ నడవవ్ అన్నట్టుగా ఉందని అనుకుంటున్నారు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో @1 మంధాన

భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. గత ఏడాదిన్నరకాలంగా ఈ ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న మంధాన.. ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆరేండ్ల (చివరిసారిగా 2019లో) తర్వాత ఆమె అగ్రస్థానానికి చేరుకోవడం ఇదే తొలిసారి.727 రేటింగ్ పాయింట్లతో మంధాన మొదటి స్థానంలో నిలవగా ఇంగ్లండ్ సారథి సీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ 719 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మంధాన తర్వాత భారత్ నుంచి జెమీమా రోడ్రిగ్స్ (14), హర్మన్‌ప్రీత్ (15) మాత్రమే టాప్-20లో చోటు దక్కించుకున్నారు. వన్డేలలో మొదటి స్థానాన ఉన్న మంధాన.. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉంది.




## మరోసారి దొరికిపోయిన విజయ్, రష్మిక

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ-నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా మరోసారి మీడియాకు దొరికిపోయారు. దీంతో వీరిద్దరూ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నారు. బుధవారం ఉదయం రష్మిక, విజయ్ కలిసి ముంబై విమానాశ్రయం నుంచి బయటకు వచ్చి- - - ఒకే కారులో వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోతోపాటు ఇద్దరూ కారు వెనుక సీటులో కలిసి కూర్చున్న ఫోటో కూడా వైరల్ గా మారింది. దీంతో మారోసారి రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ ప్రేమాయణంపై వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవలి విహారయాత్రకు వెళ్లిన వీరు.. విడివిగా ఫోటోలు బయటకు వచ్చినా.. సేమ్ ప్లేస్ కావడం ఊహాగానాలకు ఆజ్యం పోసింది. తాజాగా ఒకే కారులో కనిపించడంతో వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారంటూ అభిమానులు, నెటిజన్లు క్లారిటీకి వచ్చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో వీరి దిగిన ఫోటోలు.. ఇద్దరూ ఒకే చోట హాలిడే ట్రిప్ కు వెళ్లినట్లు చూపించాయి. అప్పటి నుంచి వీరు ప్రేమలో ఉన్నారంటూ రూమార్స్ పుట్టుకొచ్చాయి. కాగా, విజయ్ దేవరకొండ ప్రస్తుతం కింగ్డమ్ మూవీతో బిజీగా ఉండగా.. రష్మిక కుబేర మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. మరో సినిమా గర్ల్ ఫ్రెండ్ షూటింగ్ దశలో ఉంది.





## మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్ట్

వైసీపీ నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని బెంగళూరు కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోని ఇమ్మిగ్రేషన్ అధికారులు మంగళవారం (జూన్ 17) అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను బెంగళూరులోని ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడికి చేరుకున్న ఏపీ పోలీసులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని బెంగళూరు ఎయిర్పోర్ట్ పోలీసులు అప్పగించారు. అక్కడి నుంచి మూడు వాహనాల్లో బెంగళూరు నుంచి మంగళగిరికి తరలించేందుకు ఏపీ పోలీసులు బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సంబంధించిన పాస్ పోర్ట్ కూడా ఏపీ పోలీసులకు.. కర్ణాటక పోలీసులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై ఏపీ పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బెంగళూరు నుంచి శ్రీలంకలోని కొలంబో వెళ్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో ఇమిగ్రేషన్ అధికారులు మంగళవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అరెస్ట్ చేసి ఎయిర్ పోర్టు పోలీస్ స్టేసన్‌కు తరలించారు. కాగా ఏపీలో మద్యం కుంభకోణం కేసు విచారణలో భాగంగా ఇప్పటి వరకు 200 మందికిపైగా సిట్ విచారించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిట్ అధికారులు బాస్కర్ రెడ్డిని ఏ-38గా పేర్కొంది. ఇక చెవిరెడ్డి భాస్కరరెడ్డి బాల్యమిత్రుడు, సన్నిహితుడైన వెంకటేశ్ నాయుడినీ సిట్ అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఏ-34గా వెంటేశ్ నాయుడిని సిట్ చేర్చింది.

## ఘోర రోడ్డు ప్రమాదాలు.. 11 మంది మృతి

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో మూడు ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదాల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 16 మంది గాయపడ్డారు. ఆగ్రా జిల్లాలోని ఫతేహాబాద్ ప్రాంతంలో ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై బస్సు ట్రక్కును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, దాదాపు 15 మంది గాయపడ్డారు. ఢిల్లీ నుండి బీహార్‌కు వెళ్తున్న బస్సు ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. గాయపడిన ప్రయాణికులను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటన బులంద్‌షహర్ జిల్లాలో జరిగింది. వివాహం నుండి తిరిగి వస్తున్న ఐదుగురు కారు బోల్తా పడి మంటల్లో చిక్కుకుని మరణించినట్లు పోలీసులు తెలిపారు. జహంగీరాబాద్-బులంద్‌షహర్ రహదారిపై జానిపూర్ గ్రామం సమీపంలో బాధితుల వాహనం వంతెనను ఢీకొట్టి, బోల్తా పడటంతో మంటలు చెలరేగాయని.. మంటల్లో చిక్కుకుని ఐదుగురు చనిపోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని బులంద్‌షహర్ గ్రామీణ ఎస్పీ తేజ్‌వీర్ సింగ్ చెప్పారు. బుదౌన్‌లో జరిగిన ఓ వివాహానికి హాజరైన తర్వాత ఢిల్లీలోని మాల్వియా నగర్‌కు తిరిగి వెళుతున్న క్రమంలో తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే, ఆగ్రాలో జరిగిన మరో విషాద సంఘటనలో పికప్ వాహనం బ్యాలెన్స్ కోల్పోయి సహద్ర ఫ్లైఓవర్ పై నుండి పడిపోవడంతో నలుగురు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.





## మన్యంలో ఎన్‌కౌంటర్: మావోయిస్టు అగ్ర నేతలు మృతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా మారేడుపల్లి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. సెంట్రల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మహిళా కీలకనేత చలపతి భార్య అరుణ, మరొకరు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఎకె 47 రైఫిల్స్, మందుగుండు సామగ్రి, సాహిత పుస్తకాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అరుణపై రూ.10 లక్షల రివార్డ్ ఉంది.

## మహిళను కట్టేసి కొట్టడం ఏంటి చంద్రబాబు?



చిత్తూరు జిల్లా కుప్పంలో చోటుచేసుకున్న అమానుష ఘటన, ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఉదంతంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే తానే రంగంలోకి దిగుతానని ఆయన హెచ్చరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాను లేఖ రాశానని... తన లేఖకు వారం రోజుల్లోగా రిప్లై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నానని... మహిళను కట్టేసి కొట్టిన విషయం తెలిసిన వెంటనే చంద్రబాబు స్పందించారని ప్రశంసించారు.కుప్పం ఘటనలో బాధితురాలిని కొట్టిన వ్యక్తులపై ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేయాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే శాశ్వత పరిష్కారాలు అవసరమని పాల్ నొక్కిచెప్పారు. "ఇలాంటి విషయాలు ఎన్నో జరుగుతున్నాయి. మరోసారి ఇలాంటివి జరగకుండా ఉండాలంటే అసెంబ్లీలో బిల్లు పెట్టాలి. ప్రభుత్వం సరైన చర్య తీసుకోకపోతే నేనే రంగంలోకి దిగుతా" అని పాల్ ప్రకటించారు.అప్పులిచ్చి వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల తరహాలో ఇక్కడ కూడా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. "అప్పులిచ్చి మహిళలను కొట్టి, వారి ఆడపిల్లలను ఎత్తుకెళ్లి అప్పులు వసూలు చేసుకుంటున్నారు. ఇది ఎంత దారుణం? అలా వసూలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వారికి రూ. 5 లక్షల జరిమానా, 5 ఏళ్ల జైలు శిక్ష విధించాలి. అటువంటి బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని సీఎం చంద్రబాబును కోరుతున్నాను" అని పాల్ తెలిపారు.



## క్రేజీ ఎపిసోడ్‌లో పెద్ది

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా శివ రాజ్ కుమార్ తదితరులు నటిస్తున్న అవైటెడ్ భారీ చిత్రమే పెద్ది. మరి ఫస్ట్ షాట్ తో మరిన్ని అంచనాలు అందుకున్న ఈ సినిమా తాలూకా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇక ఈ చిత్రంలో ఎన్నో ఇంట్రెస్టింగ్ సీక్వెన్స్ లు ఉండగా వాటిలో ఓ సాలిడ్ యాక్షన్ ఎపిసోడ్ ని రామ్ చరణ్ పై మేకర్స్ తెరకెక్కిస్తున్నారట. ఈ సినిమాలో హైలైట్ ఎపిసోడ్స్ లో ఒకటైన ట్రైన్ ఎపిసోడ్ నే మేకర్స్ తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. రామ్ చరణ్ ఈ ఎపిసోడ్ లో అదరగొడుతుండగా బిగ్ స్క్రీన్స్ పై ఈ సన్నివేశం ఆడియెన్స్ కి గట్టి ట్రీట్ ఇస్తుందని టాక్. మరి ఇదెలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు అలాగే వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



## నాకు నటన రాదన్నారు

జన్మతహా మలయాళీ అయినా.. తెలుగులోనే ఎక్కువ సినిమాలు చేసింది అనుపమ పరమేశ్వరన్. ఈ విషయం గురించి ఆమె.. తన తాజా మలయాళ సినిమా 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' ప్రమోషన్స్‌లో మాట్లాడింది. 'తెలుగులో ఎక్కువ సినిమాలు చేయడానికీ, మాతృభాష మలయాళంలో తక్కువ సినిమాలు చేయడానికి కారణం లేకపోలేదు. మలయాళం 'ప్రేమమ్' సినిమాతో నా కెరీర్ మొదలైంది. తొలినాళ్లలో నన్ను చాలామంది ట్రోల్ చేశారు. నాకు నటనే రాదన్నారు.నన్ను విమర్శించినవారందరికీ ఈ సినిమా సమాధానమిస్తుంది. ఈ సందర్భంగా నాకు మద్దతు ఇచ్చినవారితోపాటు, నన్ను ద్వేషించినవారికి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నా.' అని పేర్కొన్నది అనుపమ పరమేశ్వరన్. ఈ నెల 27న అనుమప 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా కేరళలో విడుదల కానుంది. సురేశ్ గోపీ లాయర్‌గా నటించిన ఈ చిత్రంలో జానకిగా అనుపమ కనిపించనుంది. 'సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది..' అనేది ఈ సినిమా ఉపశీర్షిక.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## GMR ఆధ్వర్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

# సరికొత్త రికార్డు!

అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ఒకటి. ప్రతిరోజు వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ విమానాశ్రయం నుంచి లక్షలాదిమంది ఇతర రాష్ట్రాలకు, దేశాలకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక నిఘా వ్యవస్థతో పాటు సెంట్రల్, స్టేట్ పోలీసులతో భారీ భద్రత ఉంటుంది. భద్రత విషయంలో హై సెక్యూరిటీ జోన్ ఉన్నటువంటి ఎయిర్ పోర్ట్‌గా గుర్తింపు కూడా ఉంది. అదే విధంగా ఈ ఎయిర్ పోర్ట్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ జీఎంఆర్ సంస్థ మరొక రికార్డును తమ ఖాతాలో వేసుకుంది.మే నెలలో జీఎంఆర్ విమానాశ్రయాలలో సగటు ప్రయాణికుల వృద్ధి 0.8 శాతంగా నమోదైంది. కానీ, శంషాబాద్ విమానాశ్రయం అత్యధికంగా 15.3 శాతం వృద్ధిని సాధించింది. అదే సమయంలో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం 4.5 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రతిరోజు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య దాదాపు లక్షకు చేరువవుతోంది. ఇప్పటివరకు ప్రతి రోజు 95 వేల నుంచి 97 వేల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దేశంలో 74 ప్రాంతాలకు విదేశాల్లోని 21 ప్రాంతాలకు ప్రతి రోజు 620 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

## హాలీవుడ్ నటుడు

# టామ్ క్రూజ్‌కు ఆస్కార్ అవార్డు



సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డ్ హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్‌ని వరించనుంది. నవంబర్ 16న లాస్ ఏంజిల్స్‌లో జరిగే 2025 గవర్నర్స్ అవార్డ్స్‌లో టామ్ ఈ అవార్డును అందుకోబోతున్నారు. ఈ విషయాన్ని అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అధికారికంగా ప్రకటించింది. టామ్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు డాలీ పార్టన్, డెబీ అలెన్, విన్ థామస్‌కు కూడా ఈ గౌరవ పురస్కారాన్ని అందుకుంటారని అకాడమీ ప్రకటించింది. సినిమా రంగంలో టామ్ క్రూజ్ చేసిన అద్భుతమైన కృషికి, మరియు స్టంట్స్ కమ్యూనిటీకి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించనుంది. టామ్ క్రూజ్ ఇప్పటివరకు నాలుగు సార్లు ఆస్కార్ అవార్డ్‌కు నామినేట్ అవ్వగా.. ఒక్కసారి కూడా అవార్డు వరించలేదు. మరోవైపు ఇటీవల వచ్చిన మిషన్: ఇంపాజిబుల్ — ది ఫైనల్ రికనింగ్ షూటింగ్‌లో అత్యధిక బర్నింగ్ పారాచూట్ జంప్‌లు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నారు.



## 54 ఏళ్ల తర్వాత వేముల వాడ

# రోడ్డు విస్తరణకు మోక్షం

తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ పట్టణంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కీలకమైన ప్రధాన రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. మూలవాగు వంతెన నుంచి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు సుమారు 750 మీటర్ల మేర ప్రస్తుత రహదారిని 80 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 54 ఏళ్లుగా కొనసాగిన ఈ ప్రతిపాదన ఆలయ పట్టణం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు, అభివృద్ధి అవరోధాలకు ముగింపు పలికే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి నిత్యం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. పెరుగుతున్న భక్తుల సంఖ్య, పట్టణ విస్తీర్ణం, మరియు జనాభా గణనీయంగా పెరగడంతో ఇరుకుగా ఉన్న రహదారుల విస్తరణ అనివార్యమైంది. ఈ రోడ్డు విస్తరణ కోసం 1971లోనే అప్పటి సెస్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుతో పాటు కొందరు స్థానికులు విజ్ఞప్తి చేయగా, అప్పటి ఉమ్మడి కరీంనగర్ కలెక్టర్ వెంకటరమణ ప్రతిపాదనలు రూపొందించారు. అయితే, కొందరు స్థానిక నాయకుల వ్యతిరేకతతో ఈ పనులు అప్పట్లో ముందుకు సాగలేదు. 1993లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కనుమూరి బాపిరాజు ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు నిర్మించినా.. ప్రధాన మార్గాల సమస్య అలాగే ఉంది. స్మితా సబర్వాల్ కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో 100 అడుగుల రహదారిగా విస్తరించాలని కూడా ప్రతిపాదనలు చేశారు. కానీ అవి కూడా కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత భక్తుల రద్దీ మరింత పెరిగింది, దీంతో తిప్పాపూర్ వద్ద ఉన్న బస్టాండ్ నుంచి ఆలయానికి చేరుకోవడం ఇబ్బందికరంగా మారింది. గతంలో 10 వేలలోపు ఉన్న పట్టణ జనాభా ప్రస్తుతం 60 వేలకు చేరుకుంది. ఈ అంశాలన్నీ రోడ్డు విస్తరణ ఆవశ్యకతను మరింత స్పష్టం చేశాయి.

**వేములవాడలో జోరుగా కూల్చివేతలు..**

**కారణం ఏంటంటే..**

**కూల్చివేతల ప్రక్రియ..**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. వేములవాడ శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) ఆది శ్రీనివాస్ చొరవతో ఈ దశాబ్దాల పెండింగ్ ప్రాజెక్ట్ మళ్లీ పట్టాలెక్కింది. గత ఏడాది నవంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు విస్తరణకు సుమారు రూ.47 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ నిధులన్నీ రోడ్ల విస్తరణలో నష్టపరిహారం కోసం కేటాయించబడ్డాయి. ఈ ప్రాజెక్టులో 260 మందికి పైగా నివాసాలు, దుకాణాలు కోల్పోతుండగా.. ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇప్పటికే 100 మందికి నష్టపరిహార చెక్కులను అందజేసింది. కోర్టు స్టే ఉన్న గృహాలను మినహాయించి.. మిగిలిన వాటిని తొలగిస్తున్నారు. కొందరు తమ భూసేకరణను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా.. వారికి సంబంధించిన చెక్కులను అధికారులు కోర్టులోనే డిపాజిట్ చేశారు. అధికారులు 15 రోజుల కిందటే ఇళ్లు, దుకాణాలు ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేసినప్పటికీ.. చాలామంది ఇంకా ఖాళీ చేయకపోవడంతో.. ఆదివారం నాటికి ఖచ్చితంగా ఖాళీ చేయాలని, లేనిపక్షంలో బలవంతంగా తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

**భవిష్యత్ లక్ష్యాలు..**

రోడ్డు వెడల్పు పనుల తొలిదశలో భాగంగా.. స్థానిక పురపాలక సంఘానికి చెందిన మాంసం మార్కెట్ ప్రాంగణాన్ని జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ప్రధాన రహదారి వెంట ఉన్న రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన వాణిజ్య సముదాయాన్ని కూల్చగా.. నాలుగు రోజుల్లోగా రహదారికి ఇరువైపులా సేకరించిన భవనాలను కూల్చివేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయం ముందు భాగం నుంచి మూలవాగు వంతెన వరకు 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. పనులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి పర్యవేక్షించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, రోడ్ల వెడల్పును గత ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదు. ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించి.. ఆ తర్వాత పట్టించుకోకుండా దేవుడినే మోసం చేశారు అని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు వెడల్పు పనులు ప్రస్తుతం ప్రారంభమయ్యాయని.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న వారికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇచ్చామని వివరించారు. ఈ ప్రాజెక్టు వేములవాడను మరింత అభివృద్ధి పథంలో నడిపించి.. భక్తులకు, స్థానికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తుందని ఆశిస్తున్నారు.

## వేగంగా కొనసాగుతున్న గ్రీన్ ఫీల్డ్

# పోర్టు నిర్మాణ పనులు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణాజిల్లా మచిలీపట్నం వద్ద గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు ప్రమాణాలకు అనుగుణంగా అదనపు పనుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.రూ.213.66 కోట్ల అదనపు పనులకు ఈపీసీ కమిటీ సిఫార్సు చేయగా, ఏపీ మారిటైమ్ బోర్డు పనులు నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు మౌలిక సదుపాయాలు పెట్టుబడి శాఖ కార్యదర్శి వై. యువరాజ్ ఆదేశాలు జారీ చేశారు.గ్రీన్ ఫీల్డ్ పోర్టులో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వానికి మారిటైమ్ బోర్డు సీఈవో ప్రతిపాదనలు పంపారు. వీటిపై ఐఐటీ మద్రాస్ ద్వారా ప్రభుత్వం పరిశీలన జరిపింది. వారి సిఫార్సుల మేరకు ప్రభుత్వం అదనపు పనులు చేపట్టేందుకు అనుమతిస్తూ ఆదేశాలు ఇచ్చింది. తాజా అనుమతులతో పోర్టులో ఎరువుల స్టాక్ యార్డ్, బొగ్గు స్టాక్ యార్డ్, గ్రానైట్ స్టాక్ యార్డ్, ఎడిబుల్ ఆయిల్, ఇతర వస్తువులు, కంటైనర్ స్టాక్ యార్డ్, ట్రాన్సిట్ షెడ్, రైలు, రోడ్డు నెట్ వర్క్ లలో అదనపు పనులు చేపట్టనున్నారు.



## యుద్ధం మొదలైంది.. ప్రకటించిన

# ఇరాన్ సుప్రీం లీడర్

ఇజ్రాయెల్ వైమానికి దాడులు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ యుద్ధాన్ని ప్రకటించాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో యుద్ధం మొదలైంది అంటూ పోస్ట్ చేశాడు. అంతకుముందు, తన సోషల్ మీడియా ట్రూత్ ద్వారా ఖమేనీ లొంగిపోవాలంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశాడు. ఇరాన్ సుప్రీం లీడర్ ఎక్కడ దాక్కున్నాడో అమెరికాకు తెలుసు అని.. కానీ, తాము చంపబోమని.. మర్యాదగా లొంగిపోవాలని ట్రంప్ హెచ్చరిస్తూ.. జాతీయ భద్రతా బృందంతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో కూడా మాట్లాడారని వైట్ హౌస్ తెలిపింది. ఓ వైపు టెహ్రాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండగా.. ట్రంప్ కూడా టెల్ అవీవ్‌తో చేతులు కలిపేందుకు ఆలోచిస్తున్నట్లు అమెరికా మీడియా నివేదికలు పేర్కొన్నాయి.

# చంద్రబాబు పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా?

ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో స్పందించారు."చంద్రబాబు గారూ... రాష్ట్రంలో మహిళలకు మీరు కల్పిస్తున్న రక్షణ ఇదేనా? మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా? సాక్షాత్తూ మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసిస్తున్న ఘటన, మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే. తిమ్మరాయప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను మీ పార్టీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించాడు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా సరే కనికరం చూపలేదు, విడిచిపెట్టలేదు. చంద్రబాబుగారూ.. మీ హయాంలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పొలిటికల్ గవర్నెన్స్, రెడ్‌బుక్ పేరిట మీరు నెలకొల్పిన దుష్ట సంప్రదాయంలో భాగంగా మీరు, మీ పార్టీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారని జగన్




మండిపడ్డారు. ఈ ఘటనతోపాటు, ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకోవాలని, చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



# నేడు ఢిల్లీలో పర్యటించనున్న లోకేష్

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీకి వెళ్లారు. నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్న ఆయన, నేడు, రేపు అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.ఢిల్లీలో లోకేశ్ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ రోజు ఉదయం 10.30 గంటలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో ఆయన భేటీ అవుతారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు.అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో లోకేశ్ సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సాయంత్రం 5.30 గంటలకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు.రేపు ఉదయం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవియాతో ఆయన భేటీ అవుతారు. అనంతరం యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో కూడా మంత్రి లోకేశ్ సమావేశం కానున్నారు.



# ఆ వార్తలన్నీ పుకార్లే!

మాజీ దంపతులు నాగచైతన్య, సమంత 'ఏ మాయ చేసావే' రీరిలీజ్ ప్రమోషన్స్‌లో కలిసి పాల్గొనబోతున్నారంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. విడాకులు తీసుకొని ఇప్పటికే నాలుగేళ్లు గడచిపోయాయి కాబట్టి వారి మధ్య అంతగా విభేదాలు లేవని మీడియాలో వార్తలొచ్చాయి. తాజాగా వీటిపై సమంతా స్పందించింది. ఆ వార్తలన్నీ పుకార్లేనంటూ కొట్టిపారేసింది.నేను ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొనబోవడం లేదు. అసలు ఈ వార్తలు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదు. ఎవరో కోరుకుంటున్నారని వారి దృష్టికోణం నుంచి నా జీవితాన్ని గడపలేను.' అని సమంత స్పష్టం చేసింది. అదే సమయంలో నాగచైతన్య ప్రస్తావన ఏమాత్రం లేకుండా సినిమాపై ప్రశంసలు కురిపించింది. 'ఏ మాయ చేసావే' చిత్రానికి సంబంధించిన ప్రతీ సన్నివేశాన్ని గుర్తుపెట్టుకున్నానని, తన కెరీర్‌లో గొప్ప పాత్ర అదని సంతోషం వ్యక్తం చేసింది.